


# ఎలా నీకు చెప్పేది!

**అడివి శివసుబ్రహ్మణ్యం**

తన ఇంటిముందు ఒక టాక్సీవచ్చి ఆగటం, అందులోనుంచి ఇరువురు అపరిచితులు దిగటం, మేడమీది డ్రాయింగు రూంలోనుంచి గమనించిన రాజారావు ఆశ్చర్య పడుతూ క్రిందకు దిగివచ్చాడు.

అప్పుడే హాలులో అడుగు పెట్టిన దంపతు లిద్దరూ, రాజారావుకు నమస్కరించారు. రాజారావు ప్రతి నమస్కారంచేసి, 'కూర్చోండి' అన్నాడు మర్యాద సూచకంగా, సోఫాను చూపుతూ. అతడు, ఆమె—కూర్చున్నారు. రాజారావు, వంటవాడిని పిలిచి, 'మూడు కాఫీలు తే!' అని చెప్పాడు.

వచ్చిన వ్యక్తి కొంచెం కంగారుపడి, 'ఇప్పుడేమీ అవసరం లేదండి' అన్నాడు.

రాజారావు నవ్వి 'పరవాలేదు—కాఫీయేగా!' అన్నాడు.

అతడు, తనువచ్చిన విషయాన్ని ఎలా ప్రారంభించాలో తెలియక, 'నాపేరు—శ్రీరాం—ఈమె, నా మిసెస్—మాలతి—' అన్నాడు.

అతడు చెప్పేది పూర్తికాకుండానే, 'గ్లాడ్ టు మీట్ యూ' అంటూ అతడితో కరచాలనంచేసి, ఆమెవైపు తిరిగాడు.

'నమస్తే!' అంది ఆమె చేతులను రెంటినీ జోడించి.

రాజారావుకూడా ప్రత్యభివాదం చేశాడు.

తర్వాత, శ్రీరాం ప్రారంభించాడు 'మాది ఒంగోలు—నేను ఎమ్. ఎస్. సి. పాసై నాలుగు సంవత్సరాలైంది. అక్కడ కాలేజీలో రెండేళ్లు లెక్చరర్‌గా పనిచేశాను. ఇప్పుడు నాకు యూనివర్సిటీలో రిసెర్చికి అవకాశం లభించింది. అందుకని, ఇక్కడకు వచ్చాను. ప్రస్తుతం హోటలులో మకాం చేశాం. నాలుగురోజులనుంచీ, ఇల్లుకావాలని తిరుగుతున్నా, ఎక్కడా దొరకలేదు. ఈ వీధి చివర మేడలో ఒకభాగం ఖాళీగావుందని తెలిసివచ్చాం. తీరా వచ్చేసరికి, దాంట్లో ఉదయమే ఎవరోవచ్చి చేరారని తెలిసింది. మీ ఇంట్లో ప్రయత్నిస్తే, కొంతభాగం అద్దెకు లభించవచ్చునని, ఎవరో చెప్తే—ఇలావచ్చాం!' అన్నారు.

అదంతా విన్న రాజారావు సాలోచనగా 'అలాగా!' అన్నాడు.

ఒకక్షణం ఆలోచించి, 'మీరిద్దరే వుంటారా—ఇంకా ఎవరైనా వుంటారా మీతో?' అని అడిగాడు.

'ఊహూ...ఇంకెవ్వరూ వుండరు. ఎప్పుడైనా మా వాళ్లెవరైనా వస్తే, ఒక పూట వుండి వెళ్లిపోతారు' అన్నాడు శ్రీరాం.

'నేను ఒంటరిగాడినైనప్పటికీ, ఇల్లు అయితే, అద్దెకివ్వాలని లేదు. ముఖ్యంగా, నాకు ప్రశాంత వాతావరణం కావాలి. కాని, మీరు ప్రత్యేకంగా ఆశతో వచ్చారు కనుక, మిమ్మల్ని నిరాశపరచటం నా కిష్టంలేదు. క్రింది భాగంలో, ఈ మూడు గదులూ వాడు కోండి' అంటూ, రాజారావు లేచి, ఒక గదివైపు నడచాడు.

ఇద్దరూ అతడ్ని అనుసరించారు.

ఆ గదిలోనుంచి, లోపలకు వెడితే,మరొక గది. దానికి వెనుక మరొక చిన్నగది—వున్నాయి. ఆ చిన్నగదిని చూపిస్తూ 'మీరు వంటకు ఉపయోగించుకోవచ్చు, ఈ గది' అన్నాడు.

శ్రీరాం పరమానందభరితుడై, 'చాలా సంతోషమండి! మీకు అభ్యంతరం లేక పోతే, సాయంకాలమే మా సామాను తెచ్చు కుంటాం—హొటలునుంచి' అన్నాడు.

రాజారావు చిరునవ్వు నవ్వాడు. 'ఎప్పుడు రావాలనుకుంటే అప్పుడు రావచ్చు. నేను సాధారణంగా, మేడమీద డ్రాయింగు రూంలో వుంటాను. ఒకవేళ నేను లేక పోయినా, మా వంటవాడుంటాడు. వాడితో చెప్పి వుంచుతాను' అన్నాడు.

వంటవాడు కాఫీ తెచ్చాడు.

ఇద్దరికీ కాఫీలు అందించి, తను కూడా ఒక కప్పు తీసుకొన్నాడు, రాజారావు.

'ప్రస్తుతం, ఇది అడ్వాన్సుగా వుంచండి' —అంటూ, శ్రీరాం, ఒక వందరూపాయల నోటును పర్సునుంచి తీసి, రాజారావుకు అందించాడు.

రాజారావు కొంచెం ఆశ్చర్యపడి, 'చూడండి—నేను మనుష్యుల విలువలు రూపాయలతో కొలవను మీదగ్గరే వుంచండి' అన్నాడు.

ఆమాటకు శ్రీరాం కొంచెం చిన్నబుచ్చుకున్నాడు.

'అడ్వాన్సు తీసుకోనిదే అడ్వైజ్‌కెవ్వరూ ఇవ్వటంలేదీ రోజుల్లో...అందుకని...మరేమీ అనుకోకండి' అన్నాడు, నవ్వటానికి ప్రయత్నిస్తూ.

'దట్సాల్‌రైట్—మరేం పర్వాలేదు. మీ వీలుచూచుకొని, ఎప్పుడైనాసరే, రండి' అన్నాడు రాజారావు.

దంపతులిద్దరూ నమస్కరించి, శలవు తీసుకొని, వెళ్లిపోయిన తర్వాత, రాజారావు, మేడమీదున్న తన డ్రాయింగురూం వైపు నడిచాడు.

* * *

సాయంకాలం, వరండాలో శ్రీరాం పేపరు చూస్తున్నాడు, ఈజీఛైర్‌లో కూర్చుని. లోపల వంటపనిలో నిమగ్నమైంది మాలతి.

అప్పుడే లోపలికి వస్తున్న రాజారావును 'హల్లో!' అని పలుకరించాడు శ్రీరాం. తర్వాత, అతడి చేతిలోని పుస్తకం వైపు చూచి, అదేమిటండీ?' అని ప్రశ్నించాడు.

'బహుమతి పొందిన చిత్రకారుల చిత్రాలు కొన్ని సేకరించి, ఆర్ట్స్ అసోసియేషన్ వాళ్లు పుస్తకంగా ప్రచురించారు. చూడండి' అంటూ, ఆపుస్తకాన్ని అందించి, మేడపైకి వెళ్లిపోయాడు రాజారావు.

శ్రీరాం కొంతసేపు ఆ పుస్తకాన్ని తిరగవేశాడు. అందులో రాజారావు చిత్రించిన మూడు చిత్రాలున్నాయి. వాటిల్లో ఒకటి చక్కటి ప్రకృతి దృశ్యం. దానికి విజయవాడలో జరిగిన ఒక చిత్ర కళా ప్రదర్శనంలో ద్వితీయ బహుమతి లభించింది. రెండవది, అలంకరణలో వున్న నవవధువు చిత్రం. ఒక పత్రికవాళ్లు నిర్వహించిన పోటీలో ప్రథమ బహుమతి పొందింది. మూడోది, ఢిల్లీలో ఏర్పాటు చేసిన జాతీయ చిత్ర కళా ప్రదర్శనంలో ద్వితీయ బహుమతి నందుకొంది. ఆ చిత్రం పేరు 'గమ్యస్థానం!' స్మశాన వాటిక — అందులో కాలుతున్న శవం—ఆ ప్రక్కనే, రోదిస్తున్న బంధువులు—ఇదీ చిత్రం!

శ్రీరాంకు ఆశ్చర్యం వేసింది. ఎందుకంటే, రాజారావును ఒక పేరు గాంచిన చిత్రకారుగా అంతకుముందు ఎరుగడు. అతడా పుస్తకం తీసుకొని, రాజారావు రూముకు వెళ్లాడు, మేడపైకి. 'ప్రఖ్యాత చిత్రకారుడొకడు నా మిత్రుడని చెప్పుకోవటానికి ఎంతో గర్విస్తున్నాను — మీ బొమ్మలు మూడూ చాలా బాగున్నాయి' అన్నాడు.

'ఇవాళ నన్ను పొగిడేస్తున్నారేమిటి?' అన్నాడు రాజారావు, చిరునవ్వు నవ్వుతూ.

ఆ ప్రశ్నకు శ్రీరాం 'ఎప్పుడో చెయ్యవలసిన పని, ఇవాళ — చాలా ఆలస్యంగా చేస్తున్నాను—' అని జవాబిచ్చాడు; తను కూడా మందహాసంచేస్తూ. తర్వాత మళ్లీ అతడే అన్నాడు 'మేం మీ ఇంటికి వచ్చి నెలరోజులైనా, మీరు చిత్రకారులనీ, అందులో ఇంతపేరు గడించినవారనీ— నేను ఎరుగను'

'నుంచునే వున్నారు. కూర్చోండి' అన్నాడు రాజారావు, కుర్చీ చూపించి.

శ్రీరాం కూర్చుంటూ 'మీరు వేసిన చిత్రాలు ఇంకా వుంటే, ఓ సారి చూపిస్తారా?' అని అడిగాడు.

రాజారావు స్టీలు అల్మైరా తెరచి, ఒక అరలో, పదిలంగా వుంచిన ఆల్బం తీసి చూపించాడు. అందులో అన్నీ అతడు గీచిన చిత్రాలే వున్నాయి.

ఎక్కువభాగం అతడు గీసినవి ప్రకృతి దృశ్యాలు. ఆతరువాత, మరొక అరలో నుంచి, పెద్ద పొట్లమీద అతికించి వున్న పెయింటింగ్సు కొన్నింటిని చూపించాడు. శ్రీరాం, అన్ని చిత్రాలలోనూ తనకు నచ్చిన కొన్ని ప్రత్యేక ఆకర్షణలను వివరించాడు.

చిత్రాలన్నింటిని చూడటం పూర్తిఅయినాక, 'మీరు ఎన్నాళ్లుగా ఈ చిత్రకళలో కృషి చేస్తున్నారు?' అని అడిగాడు శ్రీరాం.

'నాకు అనుభవం, దాదాపుగా పన్నెండేళ్లు వుందనుకోండి—అయినా, నేనూ ఓ చిత్రకారుడిగా ప్రపంచానికి పరిచయమై ఆరు మాసాలైంది.'

తరువాత, శ్రీరాం, తమ ఇంటికి భోజనానికి ఆహ్వానించాడు రాజారావుని. ఎక్కువ బెట్టు చెయ్యకూడదని, మర్యాదకోసం అంగీకరించాడు, రాజారావు.

ఆరాత్రి భోజనంచేస్తూ, మాలతిని 'ఏమండీ!' అని రాజారావు సంబోధించినప్పుడు, 'బహువచనం ఎందుకూ—నేను మీకన్నా, చిన్నదానినే' అంది మాలతి, నవ్వుతూ.

'కొబ్బరికాయ పెరుగుపచ్చడి బాగుంది. మావంటవాడెప్పుడూ ఇంతబాగా చెయ్యలేదు' అని రాజారావు వంటకాలను మెచ్చుకున్నాడు.

బాగుందనే నెపంతో, రోజూ ఇక్కడనే భోజనం చెయ్యొచ్చుననుకున్నారా!' అన్నాడు శ్రీరాం నవ్వుతూ.

అందుకు సమాధానంగా రాజారావు 'అబ్బే—నేనల్లా అనుకోవటంలేదు—నాలుగు సార్లు భోజనానికి పిలుస్తే, అద్దెడబ్బు తీయనవసరం లేదని మీరే అనుకొంటున్నారు' అన్నాడు, దరహాసంతో.

ముగ్గురూ నవ్వుకున్నారు.

* * *

అప్పుడే పోస్టుమాను ఇచ్చివెళ్లిన ఉత్తరాన్ని చదువుకుంటున్న రాజారావు, గేటు దగ్గర, 'మాస్టారూ!' అన్నకేక విని, తల పైకెత్తి చూశాడు.

'శ్రీరాంగారుంటున్నది ఈ ఇల్లేననుకుంటాను' అన్నాడు ఆవచ్చిన యువకుడు.

'అవును—మీకేం కావాలి?' అని అడిగాడు, రాజారావు.

'మీకు వారేమవుతారో చెప్తారా?'

'నాకు కావలసినవారే—ఇంతకీ అసలు సంగతి ఏమిటో చెప్పండి'

'ఇవాళ శ్రీరాంగారు లేబొరేటరీలో ఎక్స్పెరిమెంటు ఒకటి చేస్తుంటే, స్టవు పైకివచ్చి, ముఖం కొంచెంగా కాలింది. ప్రస్తుతం జనరల్ హాస్పిటలులో వున్నారు. వారికేమీ ప్రమాదంలేదు. వారిభార్యగారిని హాస్పిటలుకు రమ్మని చెప్పండి' అని, వార్డు నెంబరు చెప్పాడా యువకుడు.

'వాట్—శ్రీరాంకు ఆక్సిడెంటా? పాపం! మేం బయలుదేరివస్తున్నాం మీరు వెళ్ళండి అన్నట్లు, మీపేరేమిటన్నారు?' విభ్రాంతి, ఆశ్చర్యం, కూడుకొనగా, త్వరత్వరగా మాట్లాడేడు, రాజారావు.

'నాపేరు నారాయణరావు. నేను యూనివర్సిటీలో ఎమ్. ఎస్. సి. చదువుతున్నాను' అని చెప్పేడతడు.

అతడు వెళ్లిపోయిన తర్వాత, రాజారావు, లోపలకు వెళ్లి, 'మాలతీ!' అని పిలచాడు. ఆతడి పిలుపుకు సమాధానంగా, ఆమె, చేతిలో సగం చదువుతున్న వారపత్రికతో ఎదురువచ్చింది. ఆమెతో, శ్రీరాం, హాస్పిటలులో వున్నాడనీ, ఆక్సిడెంటు జరిగిందనీ, ఏమీ ప్రమాదంలేదనీ చెప్పాడు.

ఆమె కన్నులు చెమర్చాయి. ఆమె చేతిలోని పుస్తకం క్రిందకు జారింది. రాజారావు ఆమెను త్వరపెట్టి, కారులో ఎక్కించి కారును స్టార్టుచేశాడు.

మాలతినీ, రాజారావునూ చూచి, మంచంమీదనే లేచి కూర్చున్నాడు, శ్రీరాం. 'ఏం జరిగిందండీ?' అంది మాలతి, వాపోతూ.

శ్రీరాం ముఖంమీద రెండు మూడు పట్టీలున్నాయి. చేతికికూడా కట్టు కట్టబడివుంది. అతడు పెదవులమీద చిరునవ్వు తెచ్చుకుంటూ, 'మరేంలేదు. ఆవిరిముఖానికి వచ్చి తగిలింది, పెద్ద ప్రమాదమేమీ జరుగలేదు. ఇందులో కంగారుపడవలసిందేమీలేదు' అన్నాడు.

# ఎలా నీకుచెప్పేది

తర్వాత, కొంతసేపు ముగ్గురూ మాట్లాడుకున్నారు. లేబొరేటరీలో ఎప్పుడూ పరధ్యాన్నంగా వుండవద్దని మందలించారు, మాలతి, రాజారావు కలసి.

పూర్తి స్వస్థత చేకూరేవరకూ, నాలుగు రోజులు హాస్పిటలులోనే వుండిపోవలసిందన్నారు, డాక్టర్లు.

* * *

ఆరోజు మధ్యాన్నం రాజారావు డ్రాయింగు రూంలో కూర్చుని, ఒక బొమ్మకు స్కెచ్ గీసుకొంటున్నాడు. మాలతి, నవ్వుతూ, అతడి గదిలోకివచ్చి, 'ఎంతసేపటినుంచీ పిలుస్తున్నా పలుకరేం—మీకు ఈ ఉత్తరం ఇచ్చిపోయాడు పోస్ట్‌మాన్' అంటూ ఒక కార్డును అతడిచేతి కందించింది. అతడా ఉత్తరాన్ని చదువుకొని, డ్రాయరు సొరుగులో పడేసి, ఇంకా అక్కడేవున్న మాలతిని ఆశ్చర్యంగా చూశాడు.

'మీరు వ్రాసిన బొమ్మలన్నీ ఒకసారి చూడాలనివుంది. చూపిస్తారా?' వీణ మీటినట్లుగా, నిర్మలంగావుంది.

'ఓ—రండి!' అంటూ, అల్మైరా తెరచి, కొన్ని చిత్రాలను చూపించాడు. ఆమె వాటిని చూచి, క్రింద అరలోవున్న ఒకే ఒక ఫొటోను బయటకు తీసి, చూచి ఆశ్చర్యపోయింది.

'ఇది ఎప్పుడు వేశారు?' అని అడిగింది.

రాజారావు కొంచెం తత్తరపాటుతో 'ఆ... ఈ మధ్యనే' అన్నాడు

మాలతి 'చాలా చక్కగా వేశారు మీ ఫొటోకు దేవుడు ప్రాణం ఇస్తే, మేమిద్దరం ఒక చోటవుంటే, బొమ్మ ఏదో కనుక్కోవటం కష్టమవుతుంది' అంది నవ్వుతూ.

అతడామె వంకే చూస్తూండి పోయాడు.


'కాఫీ పెట్టటానికి టయిమవుతోంది. వస్తా' అంటూ, క్రిందకు వెళ్లిపోయింది. మాలతి. ఆమె వెళ్లిన దిక్కే కళ్ళప్పగించి, చూస్తూ వుండిపోయాడు, రాజారావు.

రాత్రి పదకొండు గంటలు దాటింది. రాజారావుకు నిద్ర పట్టటం లేదు. లేచి, లైట్‌వేసి, మేడమీద నుంచి క్రిందకు దిగాడు. వరండా కటకటాల తలుపుకు తాళం వేసి వుంది. లోపల గది తలుపు దగ్గర వేసి వుంది. కిటికీలోంచి చూశాడు రాజారావు మంచం మీద తెల్లని వెన్నెలలాంటి దుప్పటి మీద బెడ్‌లైట్ కాంతిలో ఆమె పసిమి శరీరపు మెఱపులు అతడిలో ఏవేవో తలపులు లేపాయి. కొన్ని క్షణాలు అలాగే చూస్తూండి పోయాడు.

అతడి మనస్సులో ఎన్నెన్నో భావాలు మెదిలాయి ఇవాళే ... ఇవాళే ... నేడున్నది నిండురేయి— రేపన్నది ఎండమావి—రేపు— రేపు శ్రీరాం హాస్పిటలు నుంచి డిశ్చార్జి అయి వచ్చే రోజు—ఇంక ఆలస్యం చెయ్యకూడదు...అతడిలో ఏదో ఆవేశం ప్రవేశించింది. నెమ్మదిగా తలుపు తోశాడు. తెరచుకొంది. మాలతి పడుకొన్న మంచానికి ప్రక్కగా వెళ్లి నిలచాడు. ఆమె ఉచ్ఛ్వాస, నిశ్వాసలతో పాటుగా ఎత్తయిన ఆమె వక్షోజాలు ఇంకా ఎత్తుగా లేస్తున్నాయి. బుస్సుమని. ఏదో చెయ్యాలి ... ఆమెను ఏదైనా చేసెయ్యాలి—మెల్లగా రాజారావు ఆమెపైకి వంగేడు.

మాలతికి మెలకువ వచ్చింది. కళ్ళు తెరచి, ఆదరిపడి, లేచి కూర్చుంది. రాజారావును గుర్తించి, చిరునవ్వు నవ్వుతూ 'ఏం—ఇలా వచ్చారు?' అంది.

ఆమె చిరునవ్వొక మంత్రం — ఎదురులేని మంత్రం. దాని వెనుక నైర్మల్యం గూడుకట్టుకొని వుంది...అందులో విశ్వాసం దాగి వుంది. అనుకోని హఠాత్సంఘటనక









ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

(మిక్కిలి ఉపయోగకరమైన మందు)

తెల్ల మచ్చలు పోగొట్టుకొనుటకు, వ్యాధి యొక్క వివరములు మాకు వ్రాయండి. ఒక సిసామందు ఉచితంగా 1000 మందికి పంప దలచియున్నాము. వెంటనే వ్రాయండి.

SHRI GIRJA AYURVED
BHAWAN (193)
P.O Katrisarai (Gaya) (India)


# ఎలానీకు చెప్పేది

తడబడ్డాడు రాజారావు. 'మంచి నీళ్ళు కావాలని...' ఏదో సాకు చెప్పాడు:

'నన్ను లేపకపోయారా, పాపం!' అంటూ, ఆమె లేచి, ప్రక్కనున్న కూజాలోని మంచి నీళ్ళు గ్లాసులోపోసి, అందించింది.

.. గుండె దడ దడ లాడుతుండగా, మంచి నీళ్ళు గడగడా త్రాగేసి, 'చాలు—వస్తాను' అంటూ, సమాధానం కోసం ఎదురుచూడ కుండా, గబగబా, మేడపైకి వెళ్ళి పోయాడు, రాజారావు.

తలుపు లోపల గడియవేసుకొన్నాడు, తెల్లవారే వరకూ తియ్యకూడదు — అను కుంటూ. దీపం ఆర్పకుండా, మంచం మీద వెల్లకిలా పడుకున్నాడు, ఆలోచిస్తూ. —తాను చేసిన పనేమిటి—ఇంకా నయం— ఏమీ కూడనిది జరగలేదు. ఆమె ఏమను కొందో—ఏమిటో! అయినా, తన కిదేం పాడుబుద్ధి— ఛీఛీ—త నెంత పతనస్థితికి దిగజారుతున్నాడు! ఇంతకన్న హీనపు పని మరొకటి వుందా ఆమె, పరస్త్రీ—మరొకరి భార్య. తనను విశ్వసించిన స్త్రీ—తనపై విశ్వాసం వున్నవాని భార్య...

తలుపు చప్పుడైంది. ఆమే! గాజుల చప్పుడు వినిపిస్తూనే వుంది. 'ఆడది ఒంటరిగా వుందని వచ్చావు - బుద్ధిలేదూ— మనిషివేనా?' అని అడుగుతుంది. తనేం సమాధానం ఈయగలడు? ఒళ్ళంతా చెమటలు— రాజారావు నెమ్మదిగా వెళ్ళి, తలుపు తీశాడు—మళ్ళీ అదే చిరునవ్వుతో మంత్రిస్తూ మాలతి! చేతిలో మంచినీళ్ళ చెంబు, గ్లాసు.

తలుపు తెరవగానే, ఆమె లోనికివెళ్ళి, వాటిని మంచంప్రక్కనున్న టేబులుమీద పెట్టింది. 'రేపటినుంచీ, రాత్రిపూట మంచినీళ్ళు పెట్టమని వెంకన్నకు చెప్తాను' అంది.

రాజారావు మౌనంగా నిలబడిపోయాడు. ఆమె వెళ్ళిపోతూ, 'నాగది తలుపు దగ్గరే వేసి వుంచుతాను. ఏమైనా కావలసివస్తే పిలవండి!' అంది:

ఆమె మాటలో ఎంత వాత్సల్యం!
తన మనసులో ఎంత పశుత్వం!
ఈ రెంటిమధ్యా ఎంత వ్యత్యాసం!

నెమ్మదిగా నిద్రపోవాలని ప్రయత్నించాడు. అతడికి నిద్ర రాకుండానే, నిద్రించిన సూర్యుడు మేల్కొన్నాడు.

ఉదయం బాత్‌రూందగ్గర ముఖం కడు క్కుంటున్న రాజారావును చూసి, 'కళ్ళు ఎర్రగావున్నాయి—రాత్రి నిద్ర లేదాండీ?' అని అడిగింది మాలతి.

'అబ్బే—రాత్రి సాఫీగానే నిద్రపోయాను' —అని ఆమెకు సమాధానం ఇచ్చి, త్వర త్వరగా తన పని ముగించుకొని, మేడపైకి వెళ్ళిపోయాడు, రాజారావు.

రాజారావు సూటుకేసులో బట్టలు సర్దు కుంటుంటే, వంటవాడు, కాఫీ, టిఫినుతో గదిలోకి వచ్చాడు. వాటినక్కడపెట్టి, తిరిగి వెళ్ళబోతుంటే, 'వెంకన్నా!' అని పిలిచాడు.

'ఏం బాబూ!' వెంకన్న ఆగిపోయాడు.

నాకు విజయనగరంలో కొంచెం పనుండి వెడుతున్నాను. రేపు సాయంకాలందాకా తిరిగి రాను.'

అల్లాగే బాబూ!'

'ఇవాళ హాస్పిటలునుంచి శ్రీరాం బాబు వస్తారు—ఆయనతో చెప్పు—రేపు సాయం కాలంలోగా, ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపొమ్మని.'

'అదేమిటిబాబూ—వాళ్ళిద్దరూ దేవతల లాంటివాళ్ళు. వాళ్ళవలన మీకేం అడ్డం ఏర్పడింది బాబూ ఇప్పుడు?' అన్నాడు వెంకన్న.

'వెంకన్నా—!' తన గొంతులోని కాఠిన్యం, తనకే వెగటుగా వుంది.

'బాబూ!'

'చెప్పాను—అంతే! అలా చెయ్యి. రేపు సాయంత్రం నేను వచ్చేసరికి, వాళ్ళు ఖాళీ చేసెయ్యాలి.'

'చిత్తం బాబూ!' అని చెప్పి, వెంకన్న వెళ్ళిపోయాడు, గదిలోనుంచి మరికొన్ని క్షణాలలో అతడుకూడా సూట్‌కేసు తీసు కొని, మేడమీదినుంచి క్రిందకు దిగాడు.

* * *

శ్రీరాం హాస్పిటలునుంచి వచ్చిన తర్వాత, వెంకన్న చెప్పాడు 'మీరు రేపు సాయంకాలా నికి ఇల్లు ఖాళీచెయ్యాలని రాజారావుగారు చెప్పి వెళ్లారండి' అని.

శ్రీరాంకు ఆశ్చర్యంవేసింది. వెంటనే తేరుకొని, 'కారణమేమైనా చెప్పారా?' అని అడిగాడు.

'ఊహూఁ... లేదు బాబుగారూ!' వెంకన్న తల ఆడించాడు.

'అలాగే!' శ్రీరాం.

'మంచున్న పళంగా ఖాళీచేసి వెళ్ళిపొమ్మంటే ఎక్కడికిపోతామండీ? నాల్గు రోజులలో మరో ఇల్లు వెతుక్కొని వెడదాం!' అంది మాలతి.

శ్రీరాం, చిరునవ్వు నవ్వుతూ, బుజ్జగింపుగా, ఆమెకు చెప్పాడు, 'చూడు మాలా! మనం ఈ ఇంటికి అద్దె ఏమీ ఇవ్వటంలేదు. దీంట్లో మనకేవిధమైన అధికారమూ లేదు. ఏక్షణాన వెళ్ళిపొమ్మన్నా పోవలసిందే! సామానుసర్దు, టాక్సీ తీసుకు వస్తాను' అని.

విజయనగరంనుంచి తిరిగివచ్చిన రాజారావు వెంకన్నను పిలిచి 'వాళ్ళు ఖాళీచేసి వెళ్ళిపోయారా?' అని అడిగాడు.

'వాళ్ళు నిన్న సాయంకాలమే వెళ్ళిపోయారు బాబూ! — ఈ కవరు మీకిమ్మన్నారు' అంటూ, వెంకన్న, అలమారలోనుంచి ఒక కవరుతీసి, రాజారావుకు అందించాడు.

రాజారావు, మేడమీది తన గదిలోకి వెళ్ళి కవరు తెరచాడు.

రాజారావుగారూ!

మీ ఇంట్లో వున్నది కొద్దికాలం మాత్రమే! అయినా, మీరు చూపిన ఆదరణ, ఆప్యాయత, మరచిపోలేం. మేం వున్న నాలుగు మాసాలకూ మీకు అద్దె ఏమీ చెల్లించలేదు. నెలకు, సుమారుగా, అరవై రూపాయల చొప్పున, 250 రూపాయలకు చెక్కు వ్రాసి. దీనితో జతపరుస్తున్నాను.

తన తప్పులేమైనా వుంటే, ఒక సోదరుడిలాగా క్షమించమని, మాలతి మీకు చెప్పమంటోంది.

శలవ్—

'శ్రీరాం'

ఉత్తరంతో జతపరచి వున్న చెక్కును ముక్కలుగా, చించి, మూంపోశాడు. గదిలో మధ్యగా నిలబడి, తను చిత్రించిన మాలతి చిత్రానికేసి చూస్తూ, గద్గదంగా 'మాలతీ! నాలోని పశుత్వం ప్రకోపించి, నీ పందులాంటి జీవితం బలి అయిపోతుందేమోనని భీతితో, నిన్ను ఇంటి నుంచి గెంటివేశానని నీ కెలా తెలుస్తుంది మాలతీ—ఎలా నీకు చెప్పేది?' అంటూ, రాజారావు అరచేతితో నుదురు బాదుకుంటున్నాడు.

మాలతి నవ్వుతోంది—వెన్నెలలా—వెలుగులా—పాలనురుగులా—దేవతల వరంలా—ఇంకా—ఇంకా—ఎలాగో. ●


పిల్లి మార్కు
పాన్ మసాలా పౌడర్
వక్క తమలపాకులతో, ఇది ఒక చిటికెడు వేసుకుంటే ఏలకులు, లవంగములు వగైరా ఏమి అవసరముండదు. అన్ని సుగంధ పదార్థములు దీనిలోనే ఉన్నవి. మీ తాంబూలమునకు సువాసన, రుచి ఇచ్చును.




సాంపిలు వివరమునకు వ్రాయండి:
అరోమాటిక్ కెమికల్ అండ్ ఆయిల్ కంపెని,
7-A. సింగన్న నాయిక్ వీధి. మద్రాసు-1
P.B. నం. 1267 ఫోన్ - 22099



"కృష్ణా ట్యుటోరియల్స్"
51, చెల్ల పిళ్ళయార్ కోయిల్ వీధి,
రాయపేట ... మద్రాసు—14.
ప్రైవేటుగా చదివి
ఆంధ్ర, వెంకటేశ్వర, మరియు కర్ణాటక విశ్వవిద్యాలయముల
* మెట్రిక్యులేషన్ * ప్రీ యూనివర్సిటీ
* బి. ఏ. పరీక్షలకు హాజరుకండి.

* దిట్టమైన పోస్టల్/పర్సనల్ ట్యూషన్ యివ్వబడును.
* ప్రొఫెసర్. ఎస్. కృష్ణ అయ్యర్, ఎం. ఏ., కే. సుందరం ఎం. ఏ., ఎం. ఇడి., మరియు యితర అధ్యాపకులు స్వయముగా తరగతులు నడుపుదురు.
* కాలేజీ "పుస్తక—బ్యాంకు" నుండి పోస్టుద్వారా మరియు స్వయంగా ట్యూషన్ పొందే విద్యార్థులకు భాషా పాఠ్య పుస్తకములు ఉచితముగా సప్లయి చేయబడును.
* ఆంధ్ర మెట్రిక్ — తెలుగు, ఇంగ్లీషు భాషలు రెంటిలో తర్ఫీదు యివ్వబడును.
* ఇతర కోర్సులన్నియు ఇంగ్లీషు భాషలోనే బోధింపబడును.

ప్రాస్పెక్టస్‌కై 0—50 పైసలు మనియార్డరు పంపండి.

ఎస్. కే. అయ్యర్, ఎం. ఏ.
ప్రిన్సిపాల్.